

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర: 70

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.114	165	188
సూర్యాపేట	రూ.135	173	200
నల్లగొండ	రూ.119	173	196

ఉష్ణోగ్రత గరిష్ఠం 30.0 । కనిష్ఠం 20.0

ఎరువుల నిల్వలపై నిఘా

- కొరత సృష్టించకుండా చర్యలు
- నిరంతరం విక్రయాలపై పర్యవేక్షణ
- ఎమ్మార్పీకే విక్రయించాలని ఆదేశం
- ఈ-పాస్ యంత్రాలతోనే విక్రయాలు

యాసంగి సీజన్ ప్రారంభమైంది. గత ఏడాది పలు ప్రాంతాల్లో ఎరువుల కొరత నెలకొని రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. ఆ అనుభవాలను దృష్టిలో పెట్టుకుని, రైతులకు సరిపడా విత్తనాలు, ఎరువులు సరఫరా చేయాలని వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేశారు. ఎరువుల కొరత రాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఎరువులు, విత్తనాల దుకాణాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, సీజన్ ముగిసే వరకు దుకాణాల్లో తనిఖీలు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నారు. దుకాణా ల్లో నిల్వలు, స్టాక్‌రిజిస్టర్లను ఎప్పటికప్పుడు పోల్చిచూస్తున్నారు.

– (ఆంధ్రజ్యోతి-యాదాద్రి/ నల్లగొండ/ సూర్యాపేట సిటీ)





వివరాలు మెట్రిక్ టన్నుల్లో

జిల్లా	యూరియా	డీఏపీ	ఎంవోపీ	కాంప్లెక్స్	ఎస్ఎస్‌పీ
యాదాద్రి	11,391	1,312	1,028	4,992	-
సూర్యాపేట	10,924	2,621	651	11,731	624
నల్లగొండ	36,670	3,000	3,200	15,000	913

దుకాణాల్లో తనిఖీలు చేపట్టేందుకు వ్యవసాయ అధికారులు కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు. ఈ మేరకు ఏవోలు, ఏడీఏలు వారానికి 10 చొప్పున దుకాణాలను తనిఖీ చేయాల్సి ఉంటుంది. జిల్లా వ్యవసాయ అధికారి వారానికి ఐదు దుకాణాల్లో ఎరువుల విక్రయాలను పర్యవేక్షించి, సమీక్షించాల్సి ఉంటుంది. వారంలో రెండు రోజుల పాటు ఎరువుల నిల్వల వివరాలు సక్రమంగా నమోదు చేస్తున్నారా? దిగుమతి చేసుకున్న స్టాక్‌కు, విక్రయించిన స్టాక్‌ల మధ్య తేడా ఉందా? అన్న అంశాలను పరిశీలించనున్నారు. అదేవిధంగా ఎరువులను ఎమ్మార్పీకే విక్రయించేందుకు, సకాలంలో సరఫరా చేసేందుకు జిల్లాయంత్రాంగం చర్యలు చేపట్టింది. ఎరువులను అధికధరలకు విక్రయిస్తే డీలర్లపై చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధం చేసింది.

ఈ-పాస్ యంత్రాల ద్వారానే

ఈ-పాస్(ఎలక్ట్రానిక్ పాయింట్ ఆఫ్ సేల్) ద్వారానే ఎరువులు, విత్తనాలను విక్రయించి ఎప్పటికప్పుడు రికార్డులను ఆన్‌లైన్ నమోదు చేయాల్సి ఉంటుంది. ఎరువులు, విత్తనాల విక్రయాల్లో ఎలాంటి అవకతవకలు జరగకుండా ఉండటానికి ఈ-పాస్ యంత్రాలను వినియోగిస్తున్నారు. ఈ యంత్రాల ద్వారా విక్రయాలతో స్టాక్ నిల్వలు, ఎంత విక్రయం, ఇంకా ఎంత అవసరం అనేది స్పష్టత వస్తుండటంతో కొంత మేరకు సమస్యలు తొలగిపోయాయని తెలుస్తుంది. అయినప్పటికీ కొంతమంది వ్యాపారులు అక్రమాలకు పాల్పడుతూ సొమ్ము చేసుకుంటున్నారన్నా ఆరోపణలు ఉన్నాయి. ప్రతీ వ్యవసాయ సీజన్‌లో కంటే వానాకాలం, యాసంగి సీజన్లలో ముందస్తుగానే ఎరువులను, విత్తనాలను జిల్లాలో రైతుల అవసరాలకు, పంట విస్తీర్ణానికి అనుగుణంగా నిల్వలను అందుబాటులో ఉంచాల్సి ఉంటుంది.

యాదాద్రి జిల్లాలో..

యాదాద్రిభువనగిరి జిల్లాలో మొత్తం 17మండలాలు ఉన్నాయి. ఇప్పటివరకు 2.26లక్షల ఎకరాలకు వరకు వరితో పాటు పలుపంటలను సాగుచేశారు. మొత్తం 195విత్తన, ఎరువుల డీలర్ షాపులు ఉన్నాయి. వీటిలో పీఏసీఎస్, ఏఆర్ఎస్‌కేతో పాటు ప్రైవేట్ డీలర్లు ఉన్నారు. వ్యవసాయ అధికారుల బృందం జిల్లాలోని ఫెర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేసి, ఎరువుల విక్రయాలను పరిశీలిస్తున్నారు. ఈ మేరకు జిల్లాలోని డీలర్ల వద్ద ఉన్న పాత స్టాక్ వివరాలను సేకరిస్తున్నాయి. డీలర్ల వద్ద ఉన్న పాత స్టాక్‌ను అదే ధరలకు రైతులకు విక్రయించాలని ఆదేశాలు జారీ చేశారు. గత ఏడాది డీలర్ల వద్ద మిగిలిన ఎరువులను పాత ధరలకే విక్రయించాలని, కొత్త ధరలకు విక్రయించరాదని స్పష్టం చేశారు. కృత్రిమ ఎరువుల కొరతను సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేశారు.

నల్లగొండ జిల్లాలో...

నల్లగొండ జిల్లాలో 925 లైసెన్స్ కలిగిన ఎరువుల దుకాణాలు ఉన్నాయి. పెద్ద దుకాణాలతో పాటు గ్రామీణప్రాంతాల్లోనూ ఎరువుల దుకాణాలు ఉన్నాయి. గతంలో పర్యవేక్షణ లేక ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. గత ఏడాది సెప్టెంబరులో ఎరువుల నిల్వలను పరిశీలించకుండానే 8 మంది వ్యవసాయశాఖ అధికారులు ప్రభుత్వానికి నిల్వలు ఉన్నట్లు రిపోర్టు ఇవ్వడంతో సమస్యలు ఏర్పడ్డాయి. యూరియ కోసం రైతులు రోడ్లపై ఆందోళన చేయగా అధికారులు మాత్రం ఎరువులు ఉన్నట్లు తప్పుడు నివేదిక ఇచ్చారు. దీంతో అప్పట్లో ప్రభుత్వం ఎనిమిది మంది అధికారులను విధుల నుంచి తొలగించింది. ఈ నేపథ్యంలోనే జిల్లాలో వారం వారం ఏవోతో పాటు ఏడీఏలు 10దుకాణాలను తనిఖీ చేయడం ప్రారంభించగా జిల్లా వ్యవసాయ అధికారి ఐదు దుకాణాలను తప్పనిసరిగా తనిఖీ చేయాల్సి వస్తోంది. అధికారులు తప్పుడు నివేదికలు ఇచ్చి సస్పెండ్ అయిన అనంతరం జిల్లాలో వ్యవసాయ అధికారులు నూతనంగా దుకాణాల తనిఖీని సందర్శించడం మొదలు పెట్టారు. ఇదే విధానం రాష్ట్రవ్యాప్తంగా అమలులోకి వచ్చింది. నల్లగొండ జిల్లాలో ఈ సీజన్‌లో 56 వేల మెట్రిక్‌టన్నుల ఎరువులు అవసరం ఉన్నాయి.

జిల్లాలో 400 దుకాణాలు..

యాసంగిలో సూర్యాపేట జిల్లాలో 3 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేశారు. ఇందులో అత్యధికంగా వరి పంటను సాగు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 400కు పైగా ఎరువుల దుకాణాలు ఉన్నాయి. మొత్తం 152.289 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం కాగా, 26,552 మెట్రిక్ టన్నుల ఎరువుల నిల్వలు ప్రస్తుతం ఎరువుల దుకాణాల్లో ఉన్నాయి. ఇప్పటికే 7,178 మెట్రిక్ టన్నులు విక్రయించారు.

ఎరువుల నిల్వలపై పర్యవేక్షణ



యాసంగి సీజన్‌లో రైతులకు ఎరువులు అందుబాటులో ఉండేందు కు చర్యలు తీసుకుంటున్నాం. ఉన్నతాధికారుల ఆదేశం మేరకు జిల్లాలో ఉన్నటువంటి ఫెర్టిలైజర్ దుకాణాల్లో నిరంతరం తనిఖీలు చేయను న్నాం. ఈమేరకు ఏవోలు, డీఏవోలు వారానికి 10 దుకాణాలను తనిఖీ చేసేందుకు కార్యాచరణ ప్రణాళికను రూపొందించాం. కృత్రిమ ఎరువులు, విత్తనాలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయించే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తాం. సీజన్‌లో రైతులకు సరిపడ విత్తనాలు, ఎరువులు కూడా అందుబాటులో ఉంచుతాం. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. జిల్లా వ్యాప్తంగా అన్ని షాపుల్లోనూ విస్తృతంగా తనిఖీలు చేపట్టాం.

– కె.అనురాధ, జేడీఏ, యాదాద్రిభువనగిరి జిల్లా

పోచంపల్లి ఇక్కత్

చీరలకు విశ్వఖ్యాతి



ఇక్కత్ చీరలను పరిశీలిస్తున్న విదేశీ పర్యాటకులు

భూదాన్‌పోచంపల్లి, జనవరి 23: పోచంపల్లి చేనేత టైఅండ్‌డై ఇక్కత్ పట్టు చీరలకు ప్రపంచవ్యాప్తంగా మంచి గుర్తింపు ఉందని ఇంగ్లాండ్‌కు చెందిన మిస్ మేరియన్, జాని అనే పర్యాటకులు కితాబుఇచ్చారు. భారత్ పర్యటనలో భాగంగా ఏడు వారాలపాటు దేశంలోని వివిధ ప్రాంతాలను పర్యటిస్తూ వారు మంగళవారం యాదాద్రి-భువనగిరి జిల్లాలోని చేనేత పట్టుచీరల ఉత్పత్తి కేంద్రమైన భూదాన్‌పోచంపల్లిని సందర్శించారు. పోచంపల్లి సహకార సంఘంలోని చేనేత టైఅండ్‌డై ఇక్కత్ పట్టుచీరలను పరిశీలించారు. చేనేత పట్టుచీరల డిజైన్లను, నాణ్యతను పరిశీలించి చేనేత కళాకారుల అద్భుతమైన కళాప్రతిభను వారు ప్రశంసించారు. కార్యక్రమంలో జిల్లా చేనేత, జౌళీ శాఖ ఏడీ విద్యాసాగర్, డీవో ప్రసాద్, సహకార సంఘం మేనేజర్ రుద్ర ఆంజనేయులు పాల్గొన్నారు.

ఎస్ఎంసీ ఎన్నికలకు బ్రేక్

భువనగిరి టౌన్, జనవరి 23: ప్రభుత్వ పాఠశాలల నిర్వహణలో తల్లిదండ్రులను భాగస్వాములు చేసే లక్ష్యంతో ఏర్పాటుచేసిన పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ)ల ఎన్నికలను నిలిపివేస్తూ స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఈ నెల 29న జరుగాల్సిన ఎస్ఎంసీ ఎన్నికలకు బ్రేక్ పడింది. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఎన్నికలను నిర్వహించవద్దని డీఈవోలు, ప్రధానోపాధ్యాయులకు ఉత్తర్వులు జారీ చేశారు. షెడ్యూల్ ప్రకారం 24న ఓటర్ల తుదిజాబితా ప్రదర్శన, 29న ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. విద్యాశాఖ నిర్ణయంతో ఉమ్మడి జిల్లాలోని 3,235 పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు నిలిచిపోయాయి.వాటిలో 4,18,789మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. 2019 డిసెంబరులో ఎన్నికైన ఎస్ఎంసీ కమిటీల గడువు 2021 డిసెంబరుకే ముగిసినా అప్పటినుంచి ప్రతీ 6 మాసాలకు గడువును పొడగించగా, తుదిగడువు గత డిసెంబరుతో ముగియగా, నూతన కమిటీల కోసం ఎన్నికలు నిర్వహించే క్రమంలో విద్యాశాఖనిర్ణయంతో నిలిచాయి.

కారు నెంబరు మార్చి..

ప్రత్యేక ఏర్పాట్లు చేసి

- ఒడిశా నుంచి ఢిల్లీకి గంజాయి సరఫరా
- పంతంగి వద్ద పట్టుకున్న పోలీసులు
- 90 కిలోల గంజాయి స్వాధీనం





గంజాయి తరలిస్తున్న కారు, డిక్కీలో దాచిన గంజాయి

చౌటుప్పల్ రూరల్, జనవరి 23: కారు డిక్కీలో ప్రత్యేకంగా బాక్స్ ఏర్పాటుచేసి గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరిని జిల్లా పోలీసులు సోమవారం రాత్రి అరెస్టు చేశారు. వారి నుంచి రూ.26.70లక్షల విలువైన 90 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సీఐ దేవేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన మహమ్మద్ రియాజ్ ఆఫ్రీద్(40), మధ్యప్రదేశ్‌కు చెందిన మిథిలేష్‌సింగ్(28) ఢిల్లీలో రిక్షా కార్మికుడిగా, ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్లుగా పని చేస్తున్నారు. ఢిల్లీకి చెందిన మెహర్‌రాజ అనే గంజాయి, డ్రగ్ విక్రయదారుడితో వీరికి పరిచయంకాగా, అప్పటినుంచి గంజాయి విక్రయిస్తున్నారు. ఒడిశా నుంచి గంజాయి రవాణా చేస్తే అధిక మొత్తంలో డబ్బులు ఇస్తానని చెప్పడంతో ఆఫ్రీద్, మిథిలేష్‌సింగ్ ఒప్పుకున్నారు. ఈ క్రమంలో ఢిల్లీకి చెందిన కారును గత నెల 6వ తేదీన ఒడిశాకు పంపించారు. గంజాయి రవాణా చేయడానికి అనుకూలంగా కారులో ఏర్పాట్లు చేయించారు. ఎవరికీ అనుమానం రాకుండా డిక్కీ కింద, బాక్స్‌ను తయారు చేయించి గంజాయి ఉంచేలా సిద్ధంచేశారు. కారు నెంబరు డీఎల్ 2సీ ఏకే 5995 కాగా, దానిని ఏపీ 09బీఎల్ 1556గా మార్చారు. కారులో డిక్కీలో ఏర్పాటు చేసిన బాక్స్‌లో గం జాయి ఉంచి ఒడిశా, రాజమండ్రి మీదుగా ఢిల్లీకి బయలుదేరారు. పక్కా సమాచారం అందుకున్న మహేశ్వరం ఎస్‌వోటీ జోన్, చౌటుప్పల్ పోలీసులు సోమవారం అర్ధరాత్రి చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌గేటు వద్ద తనిఖీలు చేసి కారు డిక్కీ కింద అమర్చిన రూ.26.70లక్షల విలువైన 90కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుల నుంచి కారు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను మంగళవారం చౌటుప్పల్‌లో కోర్టులో హాజరుపర్చగా జడ్జి ఆదేశాలతో నల్లగొండ జైలుకు తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అవిశ్వాసానికి జైకొట్టారు

- నెగ్గిన భువనగిరి మునిసిపల్ అవిశ్వాస తీర్మానం
- చైర్మన్ పీఠం కోసం మొదలైన రాజకీయాలు





అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిపాదిస్తున్న ప్రిసైడింగ్ అధికారి, అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా చేతులెత్తిన కౌన్సిలర్లు

జిల్లాలో మునిసిపల్ రాజకీయాలు రసవత్తరంగా మారాయి. ఎత్తులకు పైఎత్తులు వేస్తూ అధికార పీఠాన్ని దక్కించుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇన్నాళ్లు తమ వెంటే ఉన్న కౌన్సిలర్లు పక్క పార్టీలకు జంప్ కావడంతో రాజకీ య సమీకరణలు మారి చైర్మన్ పీఠాలు చేజారిపోతున్నాయి. భువనగిరి మునిసిపాలిటీలో పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. దీంతో అధికార మార్పిడి ఖాయమైంది.

● భువనగిరి టౌన్

భువనగిరి మునిసిపల్ చైర్మన్ ఎనబోయిన ఆంజనేయులు, వైస్‌చైర్మన్ చింతల కిష్టయ్యపై ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. ఆర్డీవో అమరేందర్ ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరించిన ప్రత్యేక సమావేశం మంగళవారం మునిసిపల్ కౌన్సిల్ హాల్‌లో జరిగింది. 35 మంది కౌన్సిల్ సభ్యులకు చైర్మన్, వైస్ చైర్మన్‌పై బీఆర్ఎస్ అసంతృప్త కౌన్సిలర్లు 16 మంది, కాంగ్రెస్ తొమ్మిది మంది, బీజేపీ ఆరుగురు మొత్తం 31 మంది కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మాణం ఇచ్చారు. ఈ మేరకు నిర్వహించిన ప్రత్యేక సమావేశానికి 31మంది హాజరై అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా చేతులెత్తారు. చైర్మన్, వైస్‌చైర్మన్ అవిశ్వాస తీర్మానాలను వేర్వేరుగా ప్రిసైడింగ్ అధికారి అమరేందర్ ప్రతిపాదించగా సమావేశానికి హాజరైన 31 మంది కౌన్సిలర్లు చేతులు ఎత్తి మద్దతు తెలిపారు. దీంతో గత నాలుగేళ్లుగా పదవిలో ఉన్న చైర్మన్, వైస్ చైర్మన్ మంగళవారం నుంచి హోదా కోల్పోయారు. ఇటీవల చైర్మన్, వైస్‌చైర్మన్‌తోపాటు బీఆర్ఎస్‌కు చెందిన ఏవీ కిరణ్‌కుమార్, చెన్న స్వాతి సమావేశానికి గైర్హాజరయ్యారు. అయితే అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో ఈ నెల 20న వారిద్దరూ చేసిన రాజీనామా లేఖలను పరిగణనలోకి తీసుకోవడంలేదని మునిసిపల్ కమిషనర్ బి.నాగిరెడ్డి తెలిపారు.

క్యాంప్ నుంచి నేరుగా సమావేశానికి..

మునిసిపల్ పాలకపక్షంగా ఉన్న బీఆర్ఎస్ చైర్మన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాసానికి కారణమైన అదే పార్టీకి చెందిన అసంతృప్త 16 మంది కౌన్సిలర్లు నేరుగా క్యాంప్ నుంచి మునిసిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం కాంగ్రెస్, బీజేపీ కౌన్సిలర్లు వేర్వేరుగా కార్యాలయానికి వచ్చారు. ఉదయం 11గంటలకు ప్రారంభమైన అవిశ్వాస తీర్మాన సమావేశం 20 నిమిషాల వ్యవధిలో ముగిసింది. ఈ సందర్భంగా మునిసిపల్ కార్యాలయం వద్ద పట్టణ ఇన్‌స్పెక్టర్ ఎస్.సుధీర్ కృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కౌన్సిలర్ల అనుయాయులు, నూతన చైర్మన్, వైస్‌చైర్మన్ ఆశావాహుల మద్దతుదారులు అధికసంఖ్యలో మునిసిపల్ కార్యాలయానికి వచ్చారు. సమావేశం హాల్‌లోకి కేవలం సభ్యులను మాత్రమే అనుమతించారు.

మారుతున్న సమీకరణలు

మునిసిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్‌లపై ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానాలు నెగ్గడంతో ఇప్పటి వరకు ఉన్న సమీకరణలు మారుతున్నట్లు తెలుస్తోంది. చైర్మన్, వైస్‌చైర్మన్‌ను గద్దె దించేందుకు పార్టీలకతీతంగా కలిసి పనిచేసిన బీఆర్ఎస్ అసంతృప్త, కాంగ్రెస్, బీజేపీ కౌన్సిలర్ల మధ్య ఇప్పటివరకు ఉన్న సఖ్యతకు బీటలు వారినట్లు ప్రచారమవుతోంది.

నూతన ఎన్నికపై స్పష్టత లేదు

నూతన ఎన్నికపై ప్రభుత్వం నుంచి స్పష్టత లేకపోవడంతో అవిశ్వాస తీర్మానం ముగిసిన వెంటనే క్యాంప్‌నకు వెళ్లాలనే నిర్ణయాన్ని కౌన్సిలర్లు మార్చుకున్నట్లు తెలిసింది. ఏదేమైనా మునిసిపాలిటీపై పట్టు నిలుపుకునేందుకు బీఆర్ఎస్, సుమారు తొమ్మిదేళ్ల అనంతరం కాంగ్రెస్ జెండాను ఎగురవేసేందుకు ఆపార్టీ నాయకులు చేస్తున్న ప్రయత్నాలు, అవకాశాలను సద్వినియోగం చేసుకొని మునిసిపాలిటీపై కాషాయ జెండాను రెపరెపలాడించాలని బీజేపీ కౌన్సిలర్లు ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు ప్రచారమవుతోంది. మంగళవారం ఉదయం వరకు సఖ్యతగా ఉన్న 31 మంది కౌన్సిలర్లలో అవిశ్వాస తీర్మానం నెగ్గిన వెంటనే విభేదాలు పొడసూపటంపై పలువురు ఆశ్చర్యం వ్యక్తంచేస్తున్నారు.

బలాబలాలు

సంవత్సరం	బీఆర్ఎస్	కాంగ్రెస్	బీజేపీ	ఇతరులు	మొత్తం
భువనగిరి..					
2019	15	11	7	2	35
2024	20	9	6	-	35

గత పాలకుల నిర్లక్ష్యంతోనే

అభివృద్ధి కుంటుపడింది

- ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య
- నేడు గుట్టకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రాక



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న విప్

యాదగిరిగుట్ట రూరల్, జనవరి 23: గత పాలకుల నిర్లక్ష్యంతోనే యాదగిరిగుట్ట, ఆలేరు మునిసిపాలిటీల అభివృద్ధి కుంటుపడిందని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఆవేదన వ్యక్తంచేశారు. మంగళవారం యాదగిరిగుట్ట, ఆలేరు మునిసిపాలిటీల అభివృద్ధిపై అధికారులతో గుట్టలో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మునిసిపాలిటీలను అభివృద్ధి చేశామని గొప్పలు చెప్పుకుంటున్న గత పాలకులు కనీసం సొంత భవనాలు కూడా నిర్మించలేదన్నారు. మునిసిపాలిటీల్లో ఎన్నో సమస్యలు పేరుకుపోయాయని, వాటన్నింటినీ త్వరలో పరిష్కరిస్తానని తెలిపారు. గత పాలకుల నిర్లక్ష్యం మూలాన నిధుల్లేక మునిసిపల్ సిబ్బందికి జీతాలు ఇవ్వలేని దుస్థితి నెలకొందన్నారు. త్వరలో వైటీడీఏ, అధికారులతో రివ్యూ సమావేశం ఏర్పాటు చేస్తానని తెలిపారు. ఈ నెల 24న రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నియోజకవర్గంలో పర్యటిస్తారని, రూ.200 కోట్లతో యాదగిరిగుట్టతోపాటు పలు మండలాల్లోని అభివృద్ధి పనులు ప్రారంభిస్తారని తెలిపారు. సమావేశంలో మునిసిపల్ చైర్‌పర్సన్ ఎరుకల సుధా హేమేందర్‌గౌడ్, కౌన్సిలర్ ముక్కెర్ల మల్లేశ్, కాంగ్రెస్ నాయకులు గుండ్లపల్లి భరత్ గౌడ్, బిట్టు హరీష్, గౌలీకార్ రాజేష్, సుడుగు జీవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుట్టలో కోర్టుకోసం తాత్కాలిక భవనాల పరిశీలన

యాదగిరిగుట్ట పట్టణంలో మున్సిఫ్ కోర్టు ఏర్పాటుకోసం తాత్కాలిక భవనాలను మంగళవారం బీర్ల అయిలయ్య పరిశీలించారు. పట్టణంలోని పాత మునిసిపల్ భవనం, పాత హైస్కూల్ భవనం, టీసీ భవనాలను పరిశీలించారు. త్వరగా మున్సిఫ్ కోర్టు తాత్కాలిక భవనాన్ని నిర్ణయించి, అన్ని వసతులు కల్పించాలని ఆదేశించారు.

అసంపూర్తి పనులను పూర్తి చేయాలి

● జడ్పీచైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీచైర్మన్ సందీప్‌రెడ్డి

భువనగిరి రూరల్, జనవరి 23: జిల్లాలోని పంచాయతీ రాజ్, ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్ ఇంజనీరింగ్ శాఖలకు సంబంధించి అసంపూర్తిగా ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని జిల్లా పరిషత్ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక జడ్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆర్థిక, విద్య, వైద్యం స్థాయీ సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొన్ని అభివృద్ధి పనులు గడువు ముగిసినా పూర్తి కాకపోవడంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదన్నారు. మోటకొండూరు, మోత్కూరు, ఆలేరు మండలాల్లో అసంపూర్తిగా నిలిచిపోయిన రోడ్డు నిర్మాణ పనులను ఎన్నికల కోడ్‌కు ముందుగానే పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సిబ్బంది సమయపాలన పాటించకపోవడంతో రోగులకు సరైన వైద్య సేవలు అందడం లేదని కాంగ్రెస్ జడ్పీఫ్లోర్ లీడర్ డాక్టర్ కుడుదుల నగేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. మండలస్థాయిలో ఆసుపత్రి సలహా సంఘాల సమావేశాలు ఏర్పాటు చేసి స్థానిక ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించి వారి సలహాలను స్వీకరించాలని డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ పరిపూర్ణాచారి, డీసీహెచ్‌వో డాక్టర్ చిన్నా నాయక్‌కు సూచించారు. సమావేశంలో జడ్పీటీసీలు డాక్టర్ కె.నగేశ్, పల్లా వెంకట్‌రెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు ఎండీ కలీల్, జడ్పీ సీఈవో సీహెచ్ కృష్ణారెడ్డి, డిప్యూటీ సీఈవో బి శ్రీనివాస్‌రావు, ఆర్‌అండ్‌బీ, పీఆర్ ఈఈలు శంకరయ్య, వెంకటేశ్వర్లు, సీపీవో మాన్యా నాయక్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ నవీన్‌కుమార్, డీఎల్‌పీవో యాదగిరి తదితరులున్నారు. అంతకుముందు జడ్పీ కార్యాలయంలో కారుణ్య నియామకం కింద ఎంపికైన రెహమత్ బేగంకు జడ్పీ చైర్మన్ నియామక ఉత్తర్వు అందజేశారు.

పార్లమెంట్ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు పంకజ్, సంతోష్



కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ హనుమంతు కే.జెండగే

భువనగిరి అర్బన్, జనవరి 23: రానున్న ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు పంకజ్, సంతోష్ అన్నారు. మంగళవారం న్యూఢిల్లీ నుంచి వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ హనుమంతు కే.జెండగే, జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అములులో ఉన్న సమయంలో డబ్బు, మద్యం పంపిణీ నివారణ, స్వాధీనం చేసుకున్న నగదు, మద్యం వివరాల నిర్వహణకు ఎన్నికల సీజర్ మానిటరింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గత ఎన్నికల్లో రూపొందించిన క్యూఆర్ కోడ్‌ను 1.38లక్షల మంది వినియోగించుకున్నారని, త్వరలో ఈయాప్‌ను మరింత అభివృద్ధి చేసి అందుబాటులోకి తెస్తామన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ హనుమంతు కే.జెండగే, ఎక్సైజ్ అధికారి నవీన్‌కుమార్, డీపీవో సునంద, మాస్టర్ ట్రైనర్ నర్సిరెడ్డి పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థిని మృతిపై విచారణ

కొండమల్లేపల్లి, జనవరి 23: నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో 9వ తరగతి విద్యార్థిని భార్గవి మృతిచెందడంతో కొండమల్లేపల్లి ఎస్ఐ వీరబాబు పాఠశాలలో మంగళవారం విచారణ నిర్వహించారు. విద్యార్థులు, ప్రిన్సిపాల్ నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాలలోని సీసీ కెమెరాలను పరిశీలించారు. భార్గవి స్నేహితులు, ఉపాధ్యాయులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

బొమ్మలరామారం, అడ్డగూడూరు, నార్కట్‌పల్లి జనవరి 23: యాదాద్రిభువనగిరి, నల్లగొండ జిల్లాల్లో మంగళవారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతిచెందారు. యాదాద్రిభువనగిరి జిల్లా బొమ్మల రామారం మండలంలోని చీకటిమామిడి- యాదగిరిగుట్ట రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో దివ్యాంగుడు మృతిచెందాడు. జలాల్‌పురం గ్రామానికి చెందిన దివ్యాంగుటైన మోటె ఐలయ్య తన వికలాంగుల వాహనంపై మండలకేంద్రం నుంచి తన గ్రామానికి వెళ్తుండగా మండలకేంద్రానికి చెందిన నాగిరెడ్డి ప్రేమ్‌కుమార్‌రెడ్డి, వెంకటేష్ యాదగిరిగుట్ట దేవస్థానం నుంచి బైక్‌పై బొమ్మలరామారం వైపు వస్తున్నారు. మండల కేంద్రం శివారులో రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో దివ్యాంగుడు మోటె ఐలయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్రంగా గాయపడిన ప్రేమ్‌కుమార్‌రెడ్డి, వెంకటేష్‌ను అంబులెన్స్‌లో ఈసీఐఎల్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఐలయ్య కుటుంబానికి న్యాయం చేయాలని బంధువులు, గ్రామస్థులు సాయంత్రం 5గంటల నుంచి రాత్రి 9గంటల వరకు సుమారు నాలుగు గంటల పాటు రోడ్డుపై బైఠాయించారు. పోలీసులు, గ్రామపెద్దలు మృతుని కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

శుభకార్యానికి వెళ్లి వస్తుండగా..

అడ్డగూడూరు మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన కన్నెబోయిన లింగయ్య(62) నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలంలోని లింగోటంలో శుభకార్యానికి వెళ్లి స్వగ్రామానికి వస్తుండగా అడ్డగూడూరు మండలంలోని మానాయికుంటా గ్రామ శివారులో మంగళవారం రాత్రి బైక్ అదుపు తప్పి కింద పడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108లో సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందాడు.

రోడ్డు యూటర్న్ చేస్తుండగా

నల్లగొండ జిల్లా కట్టంగూర్ మండలంలోని ఇస్మాన్‌పల్లికి చెందిన రేకల పాపయ్య (54) తన సోదరుడు మధుసూదన్‌తో కలిసి పని నిమిత్తం బైక్‌పై నార్కట్‌పల్లికి వచ్చారు. పట్టణ శివారు చింతల్ వద్ద ఓ హోటల్‌లో భోజనం చేసి బయలు దేరారు. గోపలాయపల్లి ఆలయానికి వెళ్లే ఆర్చి ఎదురుగా ఉన్న జంక్షన్ వద్ద నార్కట్‌పల్లి వైపునకు యూటర్న్ చేస్తుండగా అదే దారిలో వెనుక నార్కట్‌పల్లి వైపు నుంచి చిట్యాల వైపుకు వెళ్తున్న లారీ ఢీ కొట్టింది. మధుసూదన్ బైక్ నడుపుతుండగా వెనుక కూర్చున్న పాపయ్య ఎగిరి రోడ్డుపై పడిపోయాడు. పాపయ్య తలకు గాయాలు కావడంతో నార్కట్‌పల్లిలోని కామినేని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. మధుసూదన్‌కు గాయాలయ్యాయి. పాపయ్య కుమారుడు శ్రవణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ నర్సిరెడ్డి తెలిపారు.

నకిలీ 'పోచంపల్లి'!

పోచంపల్లి ఇక్కత్ పేరిట ప్రింటింగ్ చీరలు

భూదాన్‌పోచంపల్లిలో విజిలెన్స్ తనిఖీలు

200 ప్రింటింగ్ చీరలు సీజ్

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



వస్త్ర దుకాణాల్లో తనిఖీ నిర్వహిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి వెంకటేశం

భూదాన్‌పోచంపల్లి, జనవరి 23: పోచంపల్లి ఇక్కత్ పేరిట విక్రయిస్తున్న 200 ప్రింటింగ్ చీరలను విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రూ.30వేల విలువైన చీర రూ.1,200, రూ.7 వేల విలువైన చీర రూ.300కే విక్రయిస్తున్నట్లు గుర్తించారు. పోచంపల్లి ఇక్కత్ బ్రాండ్ పేరుతో నకిలీ పట్టు చీరలు అమ్ముతున్నారనే ఫిర్యాదుతో తెలంగాణ ఎన్‌ఫోర్స్‌మెంట్, హ్యాండ్లూమ్, టెక్స్‌టైల్స్ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశం ఆధ్వర్యంలో విజిలెన్స్ అధికారులు యాదాద్రి జిల్లా భూదాన్‌పోచంపల్లిలోని వస్త్ర దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. సూరత్ తదితర ప్రాంతాల నుంచి ప్రింటింగ్, పవర్‌లూమ్ మిల్లులపై తయారైన వస్త్రాలను చేనేత వస్త్రాలుగా, పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలుగా విక్రయిస్తున్న దుకాణదారులకు నోటీసులు జారీ చేసి వారి నుంచి వస్త్రాలను స్వాధీనం చేసుకున్నారు. స్థానిక ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ - ఏకే ఎల్‌బీ హ్యాండ్లూమ్ మార్కెట్‌లోని పలు వస్త్ర దుకాణాలను పట్టణంలోని ప్రధాన రహదారిపై గల మరి కొన్ని వస్త్ర దుకాణాలపై దాడులు జరిపి నకిలీ చీరలు, ప్రింటింగ్ చీరలు, మిల్లు వస్త్రాలను సీజ్ చేశారు. పట్టణంలోని 12 దుకాణాల నుంచి సుమారు 200 ప్రింటింగ్ చీరలను స్వాధీనం చేసుకున్నారు. చేనేత రిజర్వేషన్ యాక్ట్‌ను ఉల్లంఘించడంతో పాటు పోచంపల్లి ఇక్కత్ చీరల డిజైన్లను ప్రింటింగ్ చేసిన వస్త్రాలను విక్రయించడం నేరమని వెంకటేశం చెప్పారు. చేనేత రక్షణ చట్టం సెక్షన్-6 కింద వారికి నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. జియోగ్రాఫికల్ ఇండికేషన్ యాక్ట్-జీఐపీ (పేటెంట్ హక్కులు) కలిగిన పోచంపల్లి చేనేత టైఅండ్‌డై ఇక్కత్ వస్త్రాల డిజైన్లను కొందరు బడా మిల్లు వ్యాపారులు ప్రింటింగ్ చేసి అతి చౌక ధరకు విక్రయిస్తూ తమకు ఉపాధి లేకుండా చేస్తున్నారని ఇటీవల భూదాన్‌పోచంపల్లి సందర్శించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు చేనేత కార్మికులు విన్నవించుకున్నారు. ఇదే సమస్యపై 'పేటెంట్‌కు పోటు.. చేనేతకు చేటు' శీర్షికన ఈ నెల 15న 'ఆంధ్రజ్యోతి'లో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. నకిలీ చీరల విక్రయాలను నియంత్రించాలని తనిఖీలు నిర్వహిస్తున్నట్లు వెంకటేశం చెప్పారు.

అవిశ్వాసానికి మద్దతుగా చేతులెత్తారు

భువనగిరి, నేరేడుచర్ల మునిసిపాలిటీల్లో నెగ్గిన తీర్మానాలు

- అవినీతి ఆరోపణలు చేస్తూ ప్రవేశపెట్టిన కౌన్సిలర్లు
- కొత్తగూడెంలో అవిశ్వాసానికి కలెక్టర్‌కు వినతి పత్రం
- మీర్‌పేటలోనూ తీర్మానం ప్రవేశపెట్టేందుకు రంగం సిద్ధం

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)



యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మునిసిపాలిటీలో అవిశ్వాసానికి మద్దతుగా చేతులెత్తిన కౌన్సిలర్లు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మునిసిపల్ రాజకీయం రసవత్తరంగా సాగుతోంది. భువనగిరి జిల్లా భువనగిరి, సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మునిసిపాలిటీల్లో మంగళవారం పెట్టిన అవిశ్వాస తీర్మానాలు నెగ్గాయి. భువనగిరి మునిసిపాలిటీలో మొత్తం 35 మంది కౌన్సిలర్లు ఉండగా, స్థానిక ఎమ్మెల్యే ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఉన్నారు. 2019లో జరిగిన ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు 15, కాంగ్రెస్‌కు 11, బీజేపీకి 7, ఇతరులు ఇద్దరు గెలిచారు. ప్రస్తుతం బీఆర్‌ఎస్ తరఫున 20, కాంగ్రెస్ నుంచి 9, బీజేపీ నుంచి ఆరుగురు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అవిశ్వాస తీర్మానానికి వీరిలో 31 మంది హాజరయ్యారు. తీర్మానాన్ని బలపరుస్తూ అంతా (బీఆర్‌ఎస్ 16, కాంగ్రెస్ 9, బీజేపీ 6) చేతులెత్తారు. దీంతో అవిశ్వాస తీర్మానం నెగ్గిందని ప్రిసైడింగ్ అధికారి ప్రకటించారు. సమావేశానికి చైర్మన్, వైస్‌చైర్మన్‌తోపాటు వారికి మద్దతుదారులైన ఇద్దరు బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. వ్యక్తిగత కారణాల పేరిట తీర్మానానికి ముందే చైర్మన్ ఆంజనేయులు, వైస్ చైర్మన్ చింతల కిష్టయ్య తమ పదవులకు రాజీనామా చేశారు. అలాగే, సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మునిసిపల్ చైర్మన్ జయబాబుపై పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. ఇక్కడ మొత్తం 15 వార్డులు ఉండగా.. 2020లో జరిగిన ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నుంచి ఏడుగురు, కాంగ్రెస్ నుంచి ఏడుగురు, సీపీఎం నుంచి ఒకరు గెలుపొందారు. తాజా రాజకీయ పరిణామాల్లో బీఆర్‌ఎస్ నుంచి ముగ్గురు, కాంగ్రెస్ నుంచి 10 మంది, సీపీఎం నుంచి ఒకరు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇద్దరు ఎక్స్ అఫీషియో సభ్యులు ఉన్నారు. మంగళవారం ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానానికి హాజరైన 13 మందీ చేతులెత్తి మద్దతు తెలిపారు. దీంతో చైర్మన్ జయబాబుపై అవిశ్వాసం నెగ్గినట్లు ప్రిసైడింగ్ అధికారి, హుజూర్‌నగర్ ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి ప్రకటించారు. ఎన్నికల సంఘం నుంచి అనుమతి వచ్చిన అనంతరం చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ఉంటుందని తెలిపారు. భువనగిరి, నేరేడుచర్ల మునిసిపాలిటీల్లో చైర్మన్లు అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపిస్తూ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి ఆమోదించడం గమనార్హం. ఇక, కొత్తగూడెం మునిసిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మిని తొలగించేందుకు అవిశ్వాస తీర్మానానికి అవకాశం కల్పించాలని కోరుతూ 22 మంది కౌన్సిలర్లు మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ డా. ప్రియాంక అలాకు వినతి పత్రం అందజేశారు. అలాగే, రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్‌పేటలోనూ అవిశ్వాసానికి రంగం సిద్ధమవుతోంది. 2020లో జరిగిన ఎన్నికల్లో ఇక్కడ కాంగ్రెస్ నుంచి ముగ్గురు సభ్యులే గెలిచారు. వారిలో ఒకరు బీఆర్‌ఎస్‌లో చేరారు. బీఆర్‌ఎస్ తరఫున 19 మంది, బీజేపీ తరఫున 16 మంది గెలిచారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ముగ్గురు బీఆర్‌ఎస్, ఒక ఇండిపెండెంట్, మరో బీజేపీ సభ్యుడు కాంగ్రెస్‌లో చేరారు. దాంతో, ఆ పార్టీ బలం ఏడుకు చేరింది. బీజేపీకి ప్రస్తుతం 14 మంది సభ్యులు ఉన్నారు. తాజాగా, కాంగ్రెస్, బీజేపీ సభ్యులు ప్రతిపాదిస్తున్న అవిశ్వాస తీర్మానానికి బీఆర్‌ఎస్‌లోని మెజారిటీ సభ్యులు కూడా అంతర్గతంగా మద్దతు తెలుపుతున్నట్టు సమాచారం. అవిశ్వాసం నెగ్గితే బీజేపీకి మేయర్, కాంగ్రెస్‌కు డిప్యూటీ మేయర్ పదవి ఇవ్వాలని ఒప్పందం సైతం చేసుకున్నట్టు తెలిసింది.

యువకుడి చేతిలో పేలిన బాణసంచా

నేరేడుచర్లలో అవిశ్వాస తీర్మానం నెగ్గిన తర్వాత బయట కొందరు యువకులు బాణసంచా కాల్చారు. నేరేడుచర్లలోని రాజీవ్‌నగర్‌కు చెందిన కాంగ్రెస్ కార్యకర్త అరిగెల రవి బాణసంచా కాల్చుతుండడంతో పొరపాటున అది చేతిలో పేలడంతో కుడిచేతి వేళ్లు తెగిపోయాయి. ప్రాథమిక చికిత్స అనంతరం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్ నిమ్స్‌కు తరలించారు.

అవిశ్వాసాలకు వ్యతిరేకంగా అప్పీళ్లు

- హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించిన మునిసిపల్ చైర్‌పర్సన్‌లు
- ప్రభుత్వానికి నోటీసులు జారీ



హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): తమపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానాలను అడ్డుకోవాలని కోరుతూ పలు మునిసిపాలిటీల చైర్‌పర్సన్‌లు, నగరాల మేయర్‌లు హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించారు. ఇప్పటికే సింగిల్ జడ్జి వీరి పిటిషన్‌లను కొట్టేయడంతో ఆ తీర్పుపై డివిజన్ బెంచ్‌లో అప్పీళ్లు దాఖలు చేశారు. చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్‌ల ధర్మాసనం ఈ పిటిషన్‌లను మంగళవారం విచారణకు స్వీకరిస్తూ ప్రభుత్వానికి నోటీసులు జారీచేసింది. తమపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మాన ప్రక్రియను అడ్డుకోవాలని కోరుతూ సదాశివపేట మునిసిపల్ చైర్‌పర్సన్ పి. జయమ్మ, జనగాం మునిసిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, అంథోల్‌జోగిపేట మునిసిపల్ చైర్‌పర్సన్ గూడెం మల్లయ్య, ఆలేరు మునిసిపల్ చైర్‌పర్సన్ వి. శంకరయ్య, జవహర్‌నగర్ మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ మేకల కావ్య హైకోర్టులో అప్పీళ్లు దాఖలు చేశారు. పిటిషనర్‌ల తరఫున సీనియర్ న్యాయవాది కె. వివేక్ రెడ్డి వాదనలు వినిపిస్తూ తెలంగాణ మునిసిపాలిటీస్ యాక్ట్ - 2019 సెక్షన్ 37లో అవిశ్వాస తీర్మానాన్ని ఎలా ఆమోదించాలన్న విధానాన్ని పేర్కొనలేదని తెలిపారు. అవిశ్వాస తీర్మాన ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాల్సిన తదుపరి చర్యల ప్రస్తావన లేదని తెలిపారు. అవిశ్వాస తీర్మాన ప్రక్రియకు సంబంధించిన స్పష్టమైన రూల్స్ ఆమోదం పొందే వరకు అప్పీలుదారులపై అవిశ్వాస తీర్మానం పెట్టడం చెల్లదని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ మునిసిపాలిటీస్ యాక్ట్ - 1965లోని సెక్షన్ 46కు విరుద్ధంగా కొత్త మునిసిపాలిటీ చట్టంలోని సెక్షన్ 37 ఉందని వివరించారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం వివరణ ఇవ్వాలని పేర్కొంటూ మునిసిపల్‌శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, డైరెక్టర్ కం కమిషనర్, మునిసిపాలిటీలు ఉన్న ఆయా జిల్లాల కలెక్టర్‌లకు నోటీసులు జారీచేసింది. తదుపరి విచారణను ఈనెల 29కి వాయిదా వేసింది.

ఈ నెలాఖరులోనే

'అసెంబ్లీ సమీక్షలు'

బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ నిర్ణయం

గులాబి బాసును కలిసిన కేటీఆర్, హరీశ్

పార్లమెంట్ స్థానాల సమీక్షపై నివేదిక అందజేత

హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అసెంబ్లీ నియోజకవర్గాల సమీక్షను ఈ నెలాఖరులోనే నిర్వహించాలని బీఆర్‌ఎస్ పార్టీ నిర్ణయించింది. ఆ పార్టీ అధినేత కేసీఆర్ ఈ మేరకు కేటీఆర్, హరీశ్‌రావుకు నిర్దేశించారు. పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా బీఆర్‌ఎస్ సమీక్షలు సోమవారంతో ముగిశాయి. ఈ సమీక్షల్లో పలువురు నేతలు, కార్యకర్తల నుంచి వచ్చిన సలహాలు, సూచనలతో కూడిన నివేదికను ఇద్దరు నేతలు కేసీఆర్‌కు అందించారు. మంగళవారం వారిద్దరూ ఎర్రవల్లిలోని ఫాంహౌస్‌కు వెళ్లి కేసీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా పార్లమెంట్ స్థానాల పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల సమీక్షలపై చర్చ జరిగింది. ఈ సమీక్షలను ఫిబ్రవరి మొదటి వారంలో నిర్వహించాలని అనుకున్నా దాన్ని ఇంకొంత ముందుకు జరపాలని నిర్ణయించారు. ఈ నెలాఖరు నుంచే వాటిని ప్రారంభించాలని దానికి తగిన కార్యాచరణ రూపొందించుకోవాలని కేసీఆర్ సూచించారు. ఈ సమీక్షలు ఆయా నియోజకవర్గ కేంద్రాల్లోనే జరపాలని అనుకున్నారు. కేటీఆర్, హరీశ్‌రావుతో పాటు పార్టీ సీనియర్ నేతలు హాజరవుతారు.

గొర్రెల స్కాం నిందితుడికి

హైకోర్టులో ఎదురుదెబ్బ

- క్వాష్ పిటిషన్ డిస్మిస్

హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): గొర్రెల పెంపకం స్కాంలో నిందితునిగా ఉన్న మేడ్చల్ జిల్లా పశు సంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ముంత ఆదిత్య కేశవ సాయికి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. గొర్రెల పెంపకం పథకంలో అవినీతికి పాల్పడ్డారని, అక్రమంగా తప్పుడు ఖాతాల్లోకి నిధులను మళ్లించారంటూ గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టేయడానికి మంగళవారం హైకోర్టు నిరాకరించింది. ఈ కేసుతో తనకు ఎటువంటి సంబంధం లేదని, గొర్రెల ఫిట్‌నెస్ పరిశీలన, సర్టిఫికెట్‌ల జారీ వంటి తనకు కేటాయించిన విధులను మాత్రమే తాను నిర్వహించానని ఆయన తెలిపారు. నిధులకు సంబంధించిన ఏ బాధ్యతలు తనకు లేవని, అందువల్ల కేసును కొట్టివేయాలని కోరుతూ ఏ-4గా ఉన్న ఆయన హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ మాధవీదేవి ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ గత ఏడాది ఆగస్టులో లావాదేవీలు జరిగితే అదే ఏడాది డిసెంబరులో అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన తర్వాత కేసు పెట్టారని పేర్కొన్నారు. ఈ కేసులో ఏ-1పై కఠిన చర్యలు తీసుకోవద్దని ఇదే హైకోర్టు ఆదేశాలు జారీచేసిన నేపథ్యంలో తనకు సైతం అవే ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఏసీబీ తరఫున న్యాయవాది విద్యాసాగర్ రావు వాదనలు వినిపిస్తూ.. గొర్రెల ట్యాగింగ్, లోడింగ్, ఫొటోగ్రఫీ, పోర్టల్‌లో వివరాల నమోదు వంటి విధులకు పిటిషనర్ బాధ్యుడని తెలిపారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. సోమవారం సాయంత్రమే ఈ కేసును ఏసీబీకి అప్పగించినట్లు ప్రభుత్వం పేర్కొందని, ఈ దశలో జోక్యం చేసుకోవడం భావ్యం కాదని పేర్కొంటూ క్వాష్ పిటిషన్‌ను డిస్మిస్ చేస్తున్నట్లు ప్రకటించింది.

కాంగ్రెస్‌లో పోటాపోటీ!

లోక్‌సభ అభ్యర్థుల ఎంపిక కసరత్తు ముమ్మరం.. నెలాఖరులో పీఈసీ భేటీ.. 2, 3 పేర్లు కేంద్రానికి

- ఖమ్మం నుంచి అయితే సోనియా.. లేకుంటే నువ్వా.. నేనా?
- రేసులో రేణుకా చౌదరి, పొంగులేటి సోదరుడు, ఇతరులూ
- నల్లగొండ, భువనగిరిల్లో ముగ్గురు నేతల ప్రయత్నాలు
- మల్కాజిగిరి సీటుపై కుసుమ్, మైనంపల్లి, ఇతరులూ ఆశ
- నిజామాబాద్‌లో దిల్ రాజు?
- వరంగల్‌లో అద్దంకి దయాకర్?



హైదరాబాద్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని 17 నియోజకవర్గాల్లో కనీసం 12 సీట్లు గెలుచుకోవాలన్న లక్ష్యంతో ఉన్న కాంగ్రెస్ పార్టీ.. ఆ దిశగా దీటైన అభ్యర్థుల ఎంపికపై కసరత్తును ముమ్మరం చేసింది. సామాజిక సమీకరణలు, గెలుపు అవకాశాలు, అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను పరిగణనలోకి తీసుకుని పార్టీ ముఖ్య నాయకులు ప్రాథమికంగా ఒక అవగాహనకు వచ్చినట్లు తెలుస్తోంది. నెలాఖరులో జరిగే ప్రదేశ్ ఎన్నికల కమిటీ(పీఈసీ) సమావేశంలో చర్చించి.. నియోజకవర్గానికి ఇద్దరు లేదా ముగ్గురు చొప్పున పేర్లను కేంద్ర ఎన్నికల కమిటీకి పంపనున్నట్లు చెబుతున్నారు. వీటిలో ఖమ్మం స్థానానికి పోటీ తీవ్రంగా ఉంది. లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ నుంచి పోటీ చేయాలంటూ ఏఐసీసీ అగ్రనేత సోనియాగాంధీని కోరుతూ టీపీసీసీ ఇప్పటికే తీర్మానాన్ని ఆమోదించి పంపిన సంగతి తెలిసిందే. ఆరోగ్య పరిస్థితుల రీత్యా ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయాలా.. వద్దా అన్న సందిగ్ధంలో సోనియా ఉన్నట్లు చెబుతున్నారు. పోటీకి ఆమె అంగీకరిస్తే ఖమ్మం నుంచే పోటీ చేయించాలని పార్టీ రాష్ట్ర నాయకత్వం ఇప్పటికే ఒక స్పష్టతకు వచ్చింది. ప్రత్యక్ష ఎన్నికలకు దూరంగా ఉండాలని ఆమె నిర్ణయించుకుంటే ఇక్కడ అభ్యర్థిగా ఎవరిని ఎంపిక చేస్తారన్నది ఆసక్తికరంగా మారింది. ఖమ్మం టికెట్ తనకే దక్కుతుందన్న ధీమాతో కేంద్ర మాజీ మంత్రి రేణుకా చౌదరి ఉన్నారు. మరో వైపు, తన సోదరుడు ప్రసాద్‌రెడ్డికి ఖమ్మం టికెట్ ఇప్పించుకునేందుకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లాకు చెందిన ప్రముఖ ఆటోమొబైల్ వ్యాపారవేత్త వంకాయలపాటి రాజేంద్రప్రసాద్, అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ దక్కని మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వర్‌రావు, పాలేరు నియోజకవర్గ నేత రాయల నాగేశ్వర్‌రావు తదితరులూ తమవంతు ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ఇక, అసెంబ్లీ ఎన్నికల్లో సూర్యాపేట టికెట్ దక్కని పటేల్ రమేశ్ రెడ్డికి లోక్‌సభ ఎన్నికల్లో నల్లగొండ టికెట్ హామీ ఇచ్చారు. ఇక్కడి నుంచి పోటీకి తాను సిద్ధమని మాజీ మంత్రి జానారెడ్డి ఇప్పటికే ప్రకటించారు. ఆయనకు నల్లగొండ టికెట్ ఇస్తే.. రమేశ్ రెడ్డిని భువనగిరి నుంచి పోటీ చేయించే అవకాశం ఉన్న ట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. కానీ, భువనగిరి టికెట్‌పైనే ఆశలు పెట్టుకుని టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్ రెడ్డి కొద్ది నెలలుగా నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటనలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నల్లగొండ, భువనగిరి సీట్లు ఎట్లా సర్దుబాటు చేస్తారన్నది ఆసక్తికరంగా మారింది. మల్కాజిగిరి నుంచి టీపీసీసీ మాజీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కుసుమ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు పేర్లు పరిశీలనలో ఉన్నాయి. వీరిద్దరూ కాకుండా అనూహ్యంగా కొత్త పేర్లు కూడా తెరపైకి వచ్చే అవకాశం ఉంది. దావోస్ పర్యటనకు సీఎం రేవంత్ రెడ్డి వెళ్లే ముందు సదరు నేతలు ఆయన్ను కలిసి మల్కాజిగిరి సీటును తమకు కేటాయించాలంటూ కోరారు. ఆ నియోజకవర్గం ఇన్‌చార్జిగా ఉన్న తుమ్మల నాగేశ్వర్‌రావునూ వారు కలిసి అభ్యర్థించారు. హైదరాబాద్ నుంచి టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు అజారుద్దీన్, పార్టీ నేత ఫిరోజ్ ఖాన్ పేర్లు పరిశీలనలో ఉన్నాయి. మహబూబ్‌నగర్ నుంచి ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్ రెడ్డి, ప్రముఖ ఫార్మా కంపెనీ అధినేత ఒకరి పేరు ప్రధానంగా పరిశీలనలో ఉంది. నిజామాబాద్ నుంచి ప్రముఖ సినీ నిర్మాత దిల్‌రాజు పేరు ప్రధానంగా పరిశీలిస్తున్నారు. జహీరాబాద్ నుంచి సురేశ్ షెట్కార్, మహబూబాబాద్ నుంచి కేంద్ర మాజీ మంత్రి బలరాం నాయక్ పేర్లు పరిశీలనలో ఉన్నాయి. మహబూబాబాద్ సీటును లంబాడాలకు కేటాయిస్తున్న నేపథ్యంలో ఆదిలాబాద్ సీటును ఆదివాసీ నేతకు కేటాయించే అవకాశం ఉంది. ఇక, ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గాలకు సంబంధించి నాగర్‌కర్నూల్ నుంచి ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, వరంగల్ నుంచి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్, పెద్దపల్లి నుంచి గడ్డం వివేక్ కుమారుడు వంశీ పేర్లు ప్రధానంగా పరిశీలిస్తున్నారు.

రేపు బూత్ లెవల్ ఏజెంట్లతో ఖర్గే సమావేశం

లోక్‌సభ ఎన్నికలకు సన్నద్ధమవుతున్న కాంగ్రెస్.. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ గెలుపులో కీలక పాత్ర పోషించిన బూత్ లెవల్ ఏజెంట్లతో గురువారం ఎల్బీ స్టేడియంలో సమావేశం నిర్వహిస్తోంది. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సమావేశం జరగనుంది. దీనికి ముఖ్య అతిథిగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హాజరు కానున్నారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, పార్టీ ముఖ్య నేతలూ పాల్గొననున్న ఈ భేటీలో లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన విధానాలపై బూత్ లెవల్ ఏజెంట్లకు దిశానిర్దేశం చేయనున్నారు. సమావేశానికి తరలి రావాలంటూ సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం వారికి పిలుపునిచ్చారు.

తెలంగాణలోనే రిచెస్ట్.. రంగారెడ్డి జిల్లా

2,3 స్థానాల్లో హైదరాబాద్, సంగారెడ్డి

తలసరి ఆదాయం ఆధారంగా గుర్తింపు

తెలంగాణ ఎకానమీ -2023 నివేదిక

హైదరాబాద్, జనవరి 23 : రాష్ట్రంలోనే అత్యంత ధనిక జిల్లాగా రంగారెడ్డి జిల్లా నిలిచింది. తెలంగాణ ఎకానమీ-2023 పేరిట రాష్ట్ర ప్రణాళికా విభాగం ఓ నివేదిక విడుదల చేసింది. ఇందులో తలసరి ఆదాయం ప్రకారం రాష్ట్రంలోనే అత్యంత ధనిక జిల్లాల జాబితాను పేర్కొంది. అత్యధిక తలసరి ఆదాయం కలిగిన జిల్లాల జాబితాలో రంగారెడ్డి, హైదరాబాద్, సంగారెడ్డి జిల్లాలు వరుసగా తొలి మూడు స్థానాల్లో ఉన్నాయి. మేడ్చల్ మల్కాజిగిరి, యాదాద్రి భువనగిరి, నల్లగొండ, మహబూబ్‌నగర్, మెదక్, భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలు వరుసగా ఆ తర్వాతి స్థానాలు దక్కించుకున్నాయి.

తెలంగాణ ఎకానమీ-2023 ప్రకారం రంగారెడ్డి జిల్లా తలసరి ఆదాయం రూ.8,15,996. రెండో స్థానంలో ఉన్న హైదరాబాద్ జిల్లా తలసరి ఆదాయం రూ. 4,03,214. మూడో స్థానంలో నిలిచిన సంగారెడ్డి జిల్లా తలసరి ఆదాయం రూ. 3,08,166గా ఉంది. ఈ గణాంకాల ప్రకారం హైదరాబాద్ వాసుల కంటే రంగారెడ్డి జిల్లా వాసులే ఎక్కువ ఆదాయం ఆర్జిస్తున్నారు. ఐటీ హబ్ కారణంగానే రంగారెడ్డి రిచెస్ట్ జిల్లాగా మారిందని నిపుణులు చెబుతున్నారు. స్థూల జిల్లా దేశీయోత్పత్తి (జీడిడిపి) పరంగా కూడా తెలంగాణలోని జిల్లాల జాబితాలో హైదరాబాద్ రెండో స్థానంలో ఉంది. జిల్లా తలసరి ఆదాయం ఆ ప్రాంతంలోని వ్యక్తుల సంవత్సర సగటు ఆదాయాన్ని తెలియజేస్తోంది. ఇక, తలసరి ఆదాయం ఆధారంగా దేశంలో టాప్-10 ధనిక రాష్ట్రాల జాబితాలో తెలంగాణ మూడో స్థానంలో ఉంది. ఈ జాబితాలో సిక్కిం మొదటి స్థానంలో ఉండగా.. గోవా రాష్ట్రం రెండో స్థానంలో ఉంది.

నేతాజీ జీవితం స్ఫూర్తిదాయకం



మోత్కూరు: పాటిమట్ల ఉన్నత పాఠశాలలో సుభాష్ చంద్రబోస్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు

మోత్కూరు/ ఆత్మకూరు(ఎం)/ రాజాపేట/ రామన్నపేట, ఆలేరు రూరల్, జనవరి 23: ఆజాద్ హింద్ ఫౌజ్ వ్యవస్థాపకుడు, దేశ స్వాతంత్య్రం కోసం ఆంగ్లేయులకు వ్యతిరేకంగా పోరాడిన ధీరుడు సుభాష్ చంద్రబోస్ జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని ఉపాధ్యాయుడు టి.ఉప్పలయ్య, బీసీ రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్ కొనియాడారు. సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా మంగళవారం బీఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మోత్కూరు హైస్కూల్ చౌరస్తాలో, పాటిమట్ల పాఠశాలల్లో నివాళులర్పించారు.

● ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో నేతాజీ, శివాజీ యువజన మండలీ ఆధ్వర్యంలో నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. శివాజీ యువజన మండలి ఆధ్వర్యంలో కస్తూర్బాగాంధీ పాఠశాలలో విద్యార్థులకు పండ్లను పంపిణీ చేశారు. ఆత్మకూరు(ఎం) సర్పంచ్ జె.నగేష్, నేతాజీ, శివాజీ యువజన మండలీల అధ్యక్ష కార్యదర్శులు పి.శంతన్‌రాజు, ఏ.మురళీకృష్ణ, మజ్జిగ నరేష్, బి.శేఖర్, పి.మల్లేశం, శ్రీను, గోవర్ధన్‌రెడ్డి, కిరణ్, సుభాష్‌రెడ్డి పాల్గొన్నారు.

● రాజాపేట మండల కేంద్రంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● రామన్నపేట, కక్కిరేణి, తుమ్మలగూడెం గ్రామాల్లో నేతాజీ విగ్రహానికి, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గోదాసు పృథ్వీరాజ్, వేముల సైదులు, వెంకటేష్, శివకుమార్, సత్యనారాయణ పాల్గొన్నారు.

● ఆలేరు మండలంలో రాఘవ స్వచ్ఛంద సేవా సంస్థతో పాటు పలు పార్టీల నాయకులు నేతీజీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆజాద్ హింద్ ఫౌజ్‌ను స్థాపించి భారత దేశాన్ని విముక్తం చేసేందుకు పోరాడిన మహానేత ఆయన అని కొనియాడారు.

ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మెతుకు సైదులు

ఆత్మకూరు(ఎం), జనవరి 23: కోర్టులో ఉన్న కేసులను పరిష్కరించి తక్షణమే ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మెతుకు సైదులు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన యూటీఎఫ్ మండల మహాసభలో ఆయన మట్లాడుతూ మెగా డీఎస్సీని నిర్వహించి వచ్చే విద్యాసంవత్సరానికి ఉపాధ్యాయుల ఖాళీలను భర్తి చేయాలని డిమాండ్ చేశారు. వచ్చే బడ్జెట్ సమావేశంలో విద్యారంగానికి అధిక నిధులు కేటాయించి, పాఠశాలల్లో స్కావెంజర్లను నియమించాలని, పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను తక్షణమే విడుదల చేయాలని కోరారు. అనంతరం యూటిఎఫ్ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దర్శనం వెంకన్న, ఉపాధ్యక్షులుగా సురకంటి అనీత, ఎల్మినేటి సోమయ్య, ప్రధాన కార్యదర్శిగా జూకంటి కరుణాకర్, కార్యదర్శులుగా అరూరు ఎల్లయ్య, పాము సునీత, కోశాధికారిగా డి.రవి, లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటాచారి, సాంస్కృతిక జిల్లా కన్వీనర్ కట్ట రమేష్, దడిపెల్లి వెంకన్న, తొర్ర ఉప్పలయ్య, ముత్యం అశోక్, జి. శ్రీను పాల్గొన్నారు.

విద్యార్థులకు వసతి గృహం ఏర్పాటు చేయాలి: ఎస్ఎఫ్ఐ



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాజు

మోత్కూరు, జనవరి 23: కళాశాల విద్యార్థుల కోసం ప్రభుత్వం వసతి గృహం (హాస్టల్) ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బుర్రు అనిల్‌కుమార్, వనం రాజు డిమాండ్ చేశారు. మంగళవారం మోత్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఎస్ఎఫ్ఐ సభ్యత్వ నమోదులో వారు పాల్గొని మాట్లాడారు. మోత్కూరులో హాస్టల్ వసతి లేక, గ్రామాలకు బస్సు సౌకర్యం లేక కళాశాల విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారన్నారు. గత ప్రభుత్వం విద్యార్థులకు చెల్లించాల్సిన రూ.5700 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలన్నారు. పాఠశాల, కళాశాల వేళలకు అన్ని రూట్లలో ఆర్టీసీ బస్సులు నడిపించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నిఖిల్, చైతన్య, మహేష్, సురేష్ పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్య రక్షణకు దివీస్ చేయూత



విద్యార్థులకు బ్యాగులు, మందులు అందజేస్తున్న సర్పంచ్

చౌటుప్పల్ రూరల్, జనవరి 23: విద్యార్థుల ఆరోగ్య రక్షణకు దివీస్ చేస్తున్న కృషి అభినందనీయమని ఆరెగూడెం సర్పంచ్ మునగాల ప్రభాకర్ రెడ్డి అన్నారు. మండల పరిధి లోని ఆరెగూడెం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు, దివీస్ ల్యాబొరేటరీస్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించి, మందులు అందించారు. స్కూల్ బ్యాగులు, పాదరక్షలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఆరెగూడెం గ్రామాభివృద్ధిలో దివీస్ తోడ్పాటు ఎంతో ఉందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వేణుగోపాల్, ధశరథ, గ్రామపెద్దలు ఎం వెంకటేశం, పీ శేఖర్‌రెడ్డి, భూపాల్ రెడ్డి, మన్నె ప్రతాప్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, అనిల్‌రెడ్డి, దివీస్ సీఎస్ఆర్ ఇన్‌చార్జి వెంకటరాజు, సాయికృష్ణ పాల్గొన్నారు.

ఆలయ కమిటీని రద్దు చేయాలి

భువనగిరి రూరల్, జనవరి 23: మండలంలోని నమాత్‌పల్లి పూర్ణగిరి లక్ష్మీనర్సింహస్వామి ఆలయ కమిటీని రద్దు చేసి నూతన కమిటీని ఏర్పాటు చేయాలని టీజీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావి సురేందర్ రెడ్డి, సర్పంచ్ ఎల్లంల శాలిని జంగయ్య యాదవ్ కోరారు. ఈ మేరకు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను మంగళవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ప్రస్తుత కమిటీ, ఆలయ అధికారులు దాతలు ఇచ్చిన విరాళాలను దుర్వినియోగం చేస్తూ అవినీతికి పాల్పడ్డారని వినతి పత్రంలో పేర్కొన్నారు.

గణతంత్ర వేడుకల వేదిక మార్పు

● ఇకనుంచి భువనగిరి ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఆవరణలోనే..

● ప్రజలను భాగస్వాములను చేసే లక్ష్యంతోనే..

● ఏర్పాట్లను పరిశీలించిన అదనపు కలెక్టర్



భువనగిరి జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

భువనగిరి టౌన్, జనవరి 23: కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి గణతంత్ర, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు కేవలం అధికారులకు, ఆహ్వానించిన మరికొద్దిమందికే పరిమితం అవుతున్నట్లు జిల్లాల పునర్విభజన జరిగినప్పటి నుంచి ప్రజల్లో ఉన్న అభిప్రాయం. జిల్లాల విభజనకు ముందు ప్రస్తుత యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి డివిజన్‌గా ఉండేది. ఈ మేరకు అప్పట్లో డివిజన్ స్థాయి గణతంత్ర, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను భువనగిరి పట్టణం నడిబొడ్డులోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహించే వారు. ఆ వేడుకల్లో వేలాది మంది ప్రజలు ఉత్సాహంగా పాల్గొనేవారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలను, ప్రముఖుల ప్రసంగాలను ఆసక్తిగా వీక్షించే వారు. దీంతో ఆ రెండు రోజుల పాటు పట్టణంలో పండుగ వాతావరణం నెలకొనేది. కానీ 2016లో ప్రభుత్వ చేపట్టిన జిల్లాల పునర్విభజనతో భువనగిరి రెవెన్యూ డివిజన్ కాస్త యాదాద్రి భువనగిరి జిల్లాగా రూపాంతరం చెందింది. దీంతో నిబంధనల పేరిట ఆ రెండు వేడుకలను కలెక్టరేట్‌లోనే నిర్వహించడం ప్రారంభించారు.

ఏర్పాట్ల పరిశీలనలో అధికార యంత్రాంగం

మొదట్లో పట్టణ శివారులోని పగిడిపల్లిలో అద్దె భవనంలో కొనసాగిన కలెక్టరేట్‌లో అనంతరం, రాయిగిరిలో నిర్మించిన శాశ్వత భవనం కలెక్టరేట్ ప్రాంగణంలో ఉత్సవాలను నిర్వహించడం ప్రారంభించారు. అధికార దర్పంగా వేడుకలను నిర్వహిస్తున్నప్పటికీ ప్రజల భాగస్వామ్యం తగ్గడం, అదే సమయంలో అధికారురులు ప్రజల మధ్య దూరం పెరుగుతున్నదనే ఆలోచనలు ప్రబలాయి. దీంతో కలెక్టరేట్‌లోని ఇరుకైన వేదికలపై ఆ వేడుకలన్ని మొక్కుబడిగా సాగేవి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో పాటు వేడుకల్లో ప్రజలను భాగస్వాములను చేసే లక్ష్యంతో గతంలో మాదిరిగానే ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఆవరణలోనే గణతంత్ర్య దినోత్సవ వేడుకలను నిర్వహించాలని జిల్లా పాలన యంత్రాంగం నిర్ణయించింది. ఈ మేరకు కళాశాల ఆవరణలో ఉత్సవాల ఏర్పాట్లను అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు పరిశీలించారు. ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లను చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో అమరేందర్, ఏసీపీ వెంకట్‌రెడ్డి, మునిసిపల్ కమిషనర్ నాగిరెడ్డి, తహసీల్దార్ అంజిరెడ్డి, జిల్లా యువజన క్రీడల అధికారి ధనంజనేయులు పాల్గొన్నారు.

భువనగిరి ఎంపీపీపై అవిశ్వాస అస్త్రం

● బుజ్జగింపుల పర్వం షురూ..



భువనగిరి మండల పరిషత్ కార్యాలయం

భువనగిరిరూరల్, జనవరి 23: భువనగిరి ఎంపీపీ నరాల నిర్మలపై 10మంది ఎంపీటీసీ సభ్యులు ఈనెల 20న అవిశ్వాసం ప్రకటిస్తూ ఆర్డీవో పి.అమరేందర్‌కు తీర్మాన ప్రతిని అందజేశారు. కాగా బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలుపొందిన నరాల నిర్మల ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రస్తుత ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆమె ఏకపక్షంగా వ్యవహరించడం, అధికారిక కార్యక్రమంలో ఆమె భర్త పెత్తనం కొనసాగిస్తుండడంతో పార్టీలకు అతీతంగా 10మంది ఎంపీటీసీ సభ్యులు ఆమెపై అవిశ్వాసం ప్రకటిస్తూ వైస్ ఎంపీపీ ఏనుగు సంజీవరెడ్డితో సహా బీఆర్ఎస్ ఎంపీటీసీలు సామల వెంకటేష్, ఉడుత శారద, కంచి లలిత, బొక్క కొండల్ రెడ్డి, రాంపల్లి కృష్ణ, రాసాల మల్లేశ్, కాంగ్రెస్ ఎంపీటీసీ సభ్యులు గడ్డమీది చంద్రకళ, గుగులోతు సుజాత, సీపీఎం ఎంపీటీసీ సభ్యురాలు గునుగుంట్ల కల్పనలు సంతకాలు చేసిన తీర్మాన పత్రాన్ని ఆర్డీవోకు అందచేశారు. అయితే కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎంపీపీ నరాల నిర్మలపై పెట్టిన అవిశ్వాస తీర్మానాన్ని కాంగ్రెస్ ఎంపీటీసీసభ్యులు పాశం శివానంద్, మట్ట పారిజాత వ్యతిరేకిస్తున్నారు. కాగా అవిశ్వాసం ప్రకటించిన మెజార్టీ సభ్యులు తమకు నోటీసులు జారి చేయాలని, అవిశ్వాస తీర్మాన సమావేశం తేదీని ప్రకటించాలని అధికారులను కోరుతున్నారు.

ఎవరి పట్టుదల వారిదే..

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన నరాల నిర్మలపై పెట్టిన అవిశ్వాస తీర్మానాన్ని వెనక్కి తీసుకోవాలని సొంత పార్టీ (కాంగ్రెస్)కు చెందిన ఎంపీటీసీ సభ్యులను ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి బుజ్జగిస్తున్నట్లు తెలిసింది. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎంపీటీసీలందరినీ హైదరాబాద్‌లోని తన ఇంటికి పిలిపించుకుని అవిశ్వాస తీర్మానాన్ని ఉపసంహరించుకోవాలని కోరినట్లు సమాచారం. మిగతా సభ్యులను కూడా ఫోన్‌లో సంప్రదించినట్లు ఓ ఎంపీటీసీ సభ్యుడు తెలిపారు. తమపై ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా ఎంపీపీపై పెట్టిన అవిశ్వాసం నెగ్గుతామని బీఆర్ఎస్ పార్టీకి చెందిన మెజార్టీ సభ్యులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

పథకాలను అర్హులకు అందించాలి

● అదనపు కలెక్టర్ వీరారెడ్డి



తుమ్మలగూడెంలో పనులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

రామన్నపేట, జనవరి 23: ప్రభుత్వ నిర్దేశించిన పలు పనులను ఎలాంటి జాప్యం లేకుండా అధికారులు సత్వరం పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి అన్నారు. మండలంలోని తుమ్మలగూడెం గ్రామాన్ని మంగళవారం ఆయన అకస్మికంగా సందర్శించి, పలు పనులను పరిశీలించి మాట్లాడారు. అర్హులైన పేదలకు ప్రభుత్వ పథకాలు అందేలా అధికారులు చొరవ తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ రికార్డులను, ఉన్నత పాఠశాల ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని, గ్రామ పెద్ద చెరువు తూమును ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో జలేందర్‌రెడ్డి, మండల పంచాయతీ అధికారి అంజిరెడ్డి, ఏపీవో వెంకన్న, తాటిపల్లి యాదయ్య, పూస బాల నర్సింహ, కార్యదర్శి ఎస్‌కె.రసూల్ పాల్గొన్నారు.

చేనేత సమస్యల పరిష్కారానికి ఐక్యంగా కృషి చేయాలి



నూతన కార్యవర్గంతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న చేనేత నాయకులు

భూదాన్‌పోచంపల్లి, జనవరి 23: చేనేత రంగ పరిరక్షణకు, చేనేత సమస్యల పరిష్కారానికి ఐక్యంగా కృషి చేయాలని చేనేత నాయకులు పిలుపునిచ్చారు. భూదాన్‌పోచంపల్లిలో మండళవారం పద్మశాలి చేనేత కార్మిక చీరల ఉత్పత్తి దారుల సంఘం 16వ వార్షికోత్సవం సర్వసభ్య సమావేశం సంఘం అధ్యక్షుడు రుద్ర శ్రీశైలం అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మునిసిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మీశ్రీనివాస్, జిల్లా చేనేత నాయకులు తడ్క వెంకటేశం, బడుగు దానయ్య, కర్నాటి ధనుంజయ, పద్మశాలి మహాజన సంఘం అధ్యక్షుడు సీత శ్రీరాములుశ్రేష్ఠి, టైఅండ్‌డై అసోసియేషన్ అధ్యక్షుడు తడక రమేష్, ఎన్నం శివకుమార్, ఉత్పత్తి దారుల సంఘం అధ్యక్షుడు రుద్ర శ్రీశైలం మాట్లాడారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన పోచంపల్లి చేనేత టైఅండ్‌డై ఇక్కత్ వస్త్రాల డిజైన్లను కొందరు బడా మిల్లు యజమానులు ప్రింటింగ్ చేసి, అతి తక్కువ ధరలకు విక్రయిస్తున్నారని, డిజైన్ల చౌర్యాన్ని అరికట్టి చేనేతను పరిరక్షించాలని కోరారు. చేనేత సమస్యల పరిష్కారానికి రాజకీయాలకతీతంగా సమిష్టిగా కృషి చేద్దాం అని అన్నారు. ఈ సందర్భంగా సంఘం నూతన కార్యవర్గం అధ్యక్షుడిగా రాపోలు శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో చేనేత నాయకులు అంకం మురళి, బడుగు చండికేశ్వర్, కస్తూరి సుదర్శన్, కర్నాటి వెంకట బాసుబ్రహ్మణ్యం, సూరపల్లి రవీందర్, బోగ విష్ణు, అంకంయాదగిరి, మెరుగు శశికళ, గంజి యుగంధర్, బోగ రమేష్, కడవేరు చంద్రశేఖర్, వనం బుచ్చిదాసు పాల్గొన్నారు.



వలిగొండ: మండలంలోని నాగారం మూసీ వాగు నుంచి అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పోలీసులు పట్టివేశారు. ట్రాక్టర్ల యజమానులు సారయ్య, నర్సింహలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ప్రభాకర్ తెలిపారు.

భువనగిరి టౌన్: శ్రీరామ జన్మభూమి ఉద్యమం లో శివసేన వ్యవస్థాపకుడు బాల్ ఠాక్రే పాత్ర చిరస్మరణీయమని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూస శ్రీనివాస్ అన్నారు. భువనగిరిలో నిర్వహించిన బాల్ ఠాక్రే జయంతి వేడుకల్లో ఆయన మాట్లాడారు. అనంతరం పండ్లు పంపిణీ చేశారు. నాయకులు ఊదరి బాలమల్లేష్, గూడెబోయిన పవన్‌కల్యాణ్, నర్సింగ్‌రావు, అజయ్ పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం) : మండలంలోని రాయిపల్లి గ్రామంలో పశువైద్యశాఖ, డీఎల్‌డీఏ పశుగణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో పశువులకు గర్భకోశవ్యాధుల నివారణ కోసం పశువైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ పంజాల సుమతి, ఎంపీటీసీ పల్లెర్ల సత్యనారాయణ, డాక్టర్ వల్లాల సంతోష్‌కుమార్ ఉప సర్పంచ్ కె.సంధ్య, పాలసంఘం చైర్మన్ సుదగాని ఇందిరమ్మ, సిబ్బంది, గోపాల మిత్రలు పాల్గొన్నారు.

చౌటుప్పల్ టౌన్ : చౌటుప్పల్ పట్టణంలోని విద్యుత్ లైన్ల మరమ్మత్తుల కారణంగా పలు కాలనీలలో ఈ నెల 24 న మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ను నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ సతీష్ తెలిపారు. చౌటుప్పల్- వన్ ఫీడర్ పరిధిలోని రామ్‌నగర్, విద్యానగర్, బీసీ కాలనీ, కృష్ణానగర్, వినాయక్ నగర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు వివరించారు.

యాదగిరిగుట్ట రూరల్: యాదగిరిగుట్ట మండలంలోని పెద్దకందుకూర్ ప్రీమియర్ కంపెనీలో టీఆర్ఎస్‌కేవీ నూతన కమిటీ ఎన్నిక జరిగింది. జనరల్ సెక్రెటరీగా బరిగె నర్సింహులు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వంచ రాంచంద్రారెడ్డి, కోశాధికారిగా గవ్వల శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా ఎ.ఎలక్షన్‌రెడ్డి, పి.ఆదాం, జి.రమేష్, ఎస్.చంద్రయ్య, కె.ఎల్లగౌడ్, వి.పాపయ్య, జి.లక్ష్మీనర్సయ్య, కె.వెంకటరమణ, డిప్యూటీ జనరల్ సెక్రెటర్లుగా ఎం. వెంకటేశ్వర్లు, జి. బాలరాజు, జె.సత్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా బి.శ్రీనివాస్ ఎన్నికయ్యారు.

చౌటుప్పల్ రూరల్ : ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ఎస్.లింగోటం గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త గోద గోవర్ధన్‌కు రాజీవ్‌స్మారక ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.15వేల ఆర్థిక సహాయం అందజేశారు.

భువనగిరి రూరల్: మండలంలోని వీరవెల్లికి చెందిన రైతు సీహెచ్ బాలస్వామి (55)అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. చందుపట్ల పీఏసీఎస్ చైర్మన్ ఎలిమినేటి మల్లారెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి, రూ.30వేల నగదు ఆర్థిక సాయం అందజేశారు.

వలిగొండ: మండలంలోని పులిగిల్ల గ్రామ పల్లె దవాఖానాకు ఆ గ్రామ వాసి ప్రవాస భారతీయులు కొలను కమలాకర్‌రెడ్డి దంపతులు సౌజన్యంతో రూ.50వేల విలువ గల వైద్య పరికరాల నిమిత్తం రూ.50వేలను కమలాకర్‌రెడ్డి తండ్రి కొలనులక్ష్మారెడ్డి చేతుల మీదుగా అందజేశారు.

వలిగొండ: మండలంలోని నర్సాపురం మదిర వెంకన్న బావిగూడేనికి చెందిన నల్ల రాజిరెడ్డి అనే రైతు పాడి ఆవు విద్యుదాఘాతంతో మృతి చెందింది. రోజుమాదిరిగానే పాడి ఆవును వ్యవసాయం పొలం వద్ద కట్టేసి ఇంటికి రాగా, ఆవు తాడును తెంచుకుని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి మృతి చెందింది. ఆవు విలువ సుమారు రూ.80వేలు ఉంటుంది. బాధిత రైతును ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

గుండాల: నవాబు పేట రిజర్వాయర్ కింద కాల్వలకు భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి మద్దెపురం రాజు కోరారు. ఈమేరకు తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు.

బొమ్మలరామారం: ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్‌గా రంగాపురం గ్రామానికి మైలారం జంగయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటుకల దేవేందర్, జిల్లా అధ్యక్షుడు దుబ్బ రామకృష్ణ, ఎంఎస్‌పీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాస్ ఉన్నారు.

చౌటుప్పల్ టౌన్ : రవాణారంగ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం డిమాండ్ చేశారు. చౌటుప్పల్ పట్టణంలోని కందాళ రంగారెడ్డి భవన్‌లో సీఐటీయూ జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ ఆటో, క్యాబ్ డ్రైవర్‌లకు జీవన భృతి కల్పించాలని కోరారు.

సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి నిధులు ఇవ్వాలి



మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరి అర్బన్, జనవరి 23: సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని నీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి వినతి పత్రం సమర్పించారు. హైదరాబాద్‌లో మంగళవారం మంత్రిని కలిసి ఎమ్మెల్యే భువనగిరి నియోజకవర్గంలోని బస్వాపూర్ రిజర్వాయర్‌తో పాటు బునాది గాని కాలువ, ధర్మారెడ్డి కాలువ అధునీకీకరణకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని కోరారు. గత ప్రభుత్వం నిధులు సకాలంలో మంజూరు చేయకపోవడంతో పనులన్ని ఎక్కడికక్కడ నిలిచిపోయాయని ఆయన దృష్టికి తెచ్చారు. అందుచేత ప్రభుత్వం తక్షణమే నిధులు మంజూరు చేసి పెండింగ్ పనులను పూర్తి చేయాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో సాగునీటి శాఖ అధికారులు వేణుగోపాల్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

వలిగొండ: పట్టణానికి చెందిన ఫ్రెండ్స్, స్పోర్ట్స్ అండ్ కల్చరర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డిని హైదరాబాద్‌లో ఆయన నివాసంలో కలిశారు. ఎఫ్ఎస్‌సీఏ అసోసియేషన్ కోసం భవన నిర్మాణానికి స్థలాన్ని కేటాయించాలని, మినీ స్టేడియాన్ని ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేను కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు.

అభ్యసనంలో కొత్త ప్రక్రియను చేపట్టాలి : డీఈవో

భువనగిరి అర్బన్, జనవరి 23: అభ్యసనలో కొత్త ప్రక్రియను చేపట్టాలని డీఈవో కె.నారాయణరెడ్డి అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం 2024 టీపీటీఎఫ్ క్యాలెండర్, డైరీని ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎం.వెంకట్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు పరిపూర్ణచారి, ఉపాధ్యక్షుడు బొక్క వెంకట్‌రెడ్డి, బయ్య లింగయ్య, కార్యదర్శులు ఎన్ క్రిష్ణ భగవత్, నాయకులు పాల్గొన్నారు.

కేసు నమోదు

ఆలేరు రూరల్, జనవరి 23: బాల కార్మికుడితో పని చేయిస్తున్న యజమానిపై చైల్డ్ హెల్ప్‌లైన్ ఫిర్యాదు మేరకు ఆలేరు ఎస్ఐ వెంకటశ్రీను మంగళవారం కేసు నమోదు చేశారు. యాదగిరిగుట్ట మండలం చొల్లేరు గ్రామానికి చెందిన కుక్కలకొండ శ్రీకాంత్ ఆలేరు బైపాస్‌లో సాయిబాబా గుడి వద్ద ఉన్న సూపర్ సిమెంట్ వాల్ కంపెనీలో పని చేస్తుండగా చైల్డ్ హెల్ప్‌లైన్ సిబ్బంది చూసి పోలీసులకు ఫిర్యాదుచేశారు. బాల కార్మికుడితో పని చేయిస్తున్న యజమాని ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన నూర్ అలాంపై కేసు నమోదు చేశామన్నారు.

యువతకు ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు రేపు

భువనగిరి అర్బన్, జనవరి 23: జిల్లాలోని యువతి, యువతకు ఉద్యోగాల కోసం ఈ నెల 25న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఉపాధి కల్పన అధికారి పి.సాహితి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ 30, గ్రూపు లీడర్లు రెండు చొప్పున ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఆసక్తి, అర్హత గల యువతీ యువకులు తమ బయోడేటా, విద్యార్హత ధ్రువపత్రాల జీరాక్స్ పత్రాలు అందజేయాలని కోరారు. ఉదయం 11గంటల వరకు జిల్లా ఉపాధి కల్పన అధికారి కార్యాలయంలో ఇంటర్వ్యూలకు హజరుకావాలని ఆమె కోరారు.

బాలుడిపై యువకుల దాడి

● ఏడుగురు యువకులపై కేసు నమోదు



బాలుడి వీపుపై గాయాలు

భూదాన్‌పోచంపల్లి, జనవరి 23: నా చెల్లితో చనువుగా ఉంటావా..? అంటూ ఓ బాలుడిపై యువతి సోదరుడు సహా ఏడుగురు దాడి చేశారు. సోమవారం రాత్రి భూదాన్‌పోచంపల్లి మండలంలో ఈ ఘటన జరిగింది. ఎస్ఐ విక్రంరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. భూదాన్‌పోచంపల్లి పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన విద్యార్థి స్థానికంగా తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. అదే కాలనీకి చెందిన ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థినితో బాలుడు చనువుగా ఉంటున్నాడని ఆమె సోదరుడికి అనుమానం వచ్చింది. దీంతో ఆమె సోదరుడు వినయ్ సోమవారం రాత్రి బాలుడిని మార్కండేయనగర్ కాలనీ (పాతకోట) సమీపంలో అడ్డగించి, తన స్నేహితులతో కలిసి వచ్చి బెదిరించాడు. ముక్తాపూర్ సమీపాన ఉన్న రైతు పొలంలోని కొట్టంలోకి తీసుకెళ్లారు. అప్పటికే వినయ్ వెంట ఉన్న స్నేహితులు బొడిగె వరుణ్‌తేజ్, గోరుగంటి సాయి, మూషం నితిన్‌కుమార్, తండ ప్రణీత్, గోరుకంటి మురళీతోపాటు మరో వ్యక్తి (గుర్తు తెలియని) మద్యంమత్తులో ఉన్నారు. ఏడుగురు కలిసి సుమారు గంటసేపు విచక్షణారహితంగా దాడిచేశారు. అంతటితో ఆగకుండా అక్కడే ఉన్న ఇనుపరాడ్లను అప్పటికప్పుడు కాల్చి తొడలు, చేతులు, పిరుదలు, వీపుపై వాతలు పెట్టడంతోపాటు మర్మాంగ ప్రదేశంలో దాడిచేశారు. ఈ దాడిలో స్పృహ కోల్పోయిన బాలుడికి నీటిని తాపించి స్పృహ వచ్చేలా చేసి, మరోసారి గొంతును నులిమి పైశాచికానందం పొందారు. ఎంత చెప్పినా వినకుండా విచక్షణారహితంగా దాడిచేసి హత్యాయత్నానికి పాల్పడ్డారని ఎస్ఐ తెలిపారు. బాలుడి వెంట ఉన్న స్నేహితుడు అమ్మానాన్నలకు ఫోన్ చేస్తానని చెప్పడంతో నువ్వు వెళ్లి ఇంటి దగ్గర వదిలేయాలని బెదిరించి అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఇంటికి వచ్చిన బాలుడి పరిస్థితిని చూసిన తల్లిదండ్రులు కుమారుడి ఒంటిపై ఉన్న గాయాలను, గాట్లను, కాల్చిన వాతలు చూసి బోరున విలపించారు. అపస్మారక స్థితిలో ఉన్న తన కుమారుడిని స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందించి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. కాగా బాధిత బాలుడిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనలో పాల్గొన్న ఏడుగురిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని, నిందితులను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ విక్రంరెడ్డి తెలిపారు.

లైంగికదాడి కేసులో నిందితుడి రిమాండ్

మోత్కూరు, జనవరి 23: బాలికపై లైంగికదాడి కేసులో మోత్కూరు మండలం దత్తప్పగూడెం గ్రామానికి చెందిన నిందితుడు వల్లమాల వినయ్(25)ను మంగళవారం రామన్నపేట సీఐ మోతీరాం అరెస్టు చేసి, రిమాండ్ చేశారని మోత్కూరు ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. వలిగొండ మండలానికి చెందిన బాలికను ప్రేమించానని, పెళ్లి చేసుకుంటానని చెప్పి నిందితుడు వినయ్ దత్తప్పగూడెంలోని తన ఇంటికి తీసుకెళ్లి లైంగికదాడి చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు వినయ్, అతనికి సహకరించిన అతని తల్లిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బీజేపీ నిరంకుశ పాలనను ప్రజలు ఖండించాలి

ఆలేరు రూరల్, జనవరి 23: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేస్తున్న నిరంకుశ పాలనను ప్రజలంతా ఖండించాలని యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఊట్కూరి సురేష్‌గౌడ్ కోరారు. మంగళవారం ఆలేరులో రాహుల్ గాంధీ చేస్తున్న భారత్ జోడో పాదయాత్రను అడ్డుకుని, దాడి చేసినందుకు నిరసిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాహుల్ గాంధీ యాత్రపై దాడి చేయడం హేయమైన చర్య అని అన్నారు. సంతోష్, అజయ్, శివశంకర్, రమేష్ ఉన్నారు.